క్లుప్తంగా

పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యం

డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శాస్త్రవేత్త బాలమురళీకృష్ణన్



జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభిస్తున్న బాలమురళీకృష్ణన్

ఇబ్రహీంపట్నం రూరల్: సాంకేతిక విద్యనభ్యసించే విద్యార్థులు పరిశోధనాత్మక విద్యాకే ప్రాధాన్యత ఇవ్వాలని అప్పుడు మంచి ప్రయోజకులవుతారని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ బాలమురళీకృష్ణన్ పేర్కొన్నారు. మంగళ్‌పల్లి సమీపంలో గల సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరగబోయే సీఎస్‌షియా -2024 పేరుతో సాంకేతిక సంబరాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్ రాఘవ చెర బుడ్డితో కలిసి బాలమురళీకృష్ణ జ్యోతి ప్రజ్వా లన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాసా రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్కం శివారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

దండుమైలారంలో వాల్ రైటింగ్ తొలగింపు



గోడలపై వ్రాతలను తుడిచివేయిస్తున్న తహసీల్దార్ సునీత

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని తహసీల్దార్ సునీత పేర్కొన్నారు. దండుమైలారానికి ప్రత్యేకాధికారిగా ఆమె గురువారం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా గోడలపై వ్రాతలను తుడిచి వేయించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొత్తగా వేసిన సీసీ రోడ్లను పరిశీలించారు. గోడలపై ఎలాంటి వాల్ రైటింగ్‌లు ఉండొద్దని, వాటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పుష్పలత పాల్గొన్నారు.

రుణ మాఫీకోసం వడ్డీ చెల్లించండి

రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి

హయత్‌నగర్: స్వల్ప కాలిక రుణాలు మాఫీ కావాలంటే మొత్తం వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకుంటే రుణ మాఫీకి అర్హులవుతారని హయత్‌నగర్ రైతు సేవా సహాయ సహకార సంఘం అధ్యక్షుడు చామ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి తగిన రుణాలను అందించి ఆర్థికంగా సహకరిస్తున్నామని పేర్కొన్నారు. దీర్ఘ కాలిక రుణాలు అందించేందుకు రూ.3కోట్లు మంజూరయ్యాయని రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఈఓ మల్లిఖార్జున్ 2023–24 వార్షిక బడ్జెట్‌ను చదివి వినిపించగా సభ్యులు దాన్ని ఆమోదించారు. తెలంగాణా కో ఆపరేటివ్ యూనియన్ ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ డి.విజయలక్ష్మి, డైరెక్టర్‌లు నర్సింహారెడ్డి, డి.అంజయ్య, జగన్మోహన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, యాదమ్మ, నర్సమ్మ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా మల్లమ్మ



నార్లకొండ మల్లమ్మ

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నార్లకొండ మల్లమ్మజంగయ్యయాదవ్ కొనసాగనున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారిణి ధాత్రీదేవి ప్రకటించారు. చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 28వ తేదీన అవిశ్వాస పరీక్షలో 9మంది సభ్యులు పాల్గొని చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ విషయంలో అప్పటికే చైర్మన్ కోర్టును ఆశ్రయించడంతో అవిశ్వాస పరీక్షకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచారు. తాజాగా చైర్మన్ వేసిన స్టే పిటీషన్‌ను కోర్టు కొట్టివేసింది. దీంతో చైర్మన్‌గా ఉన్న విఠల్‌రెడ్డిని పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. మరొకరిని చైర్మన్‌గా ఎన్నుకునేంత వరకూ ప్రస్తుతం వైస్‌చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న నార్లకొండ మల్లమ్మ జంగయ్యయాదవ్‌ను ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

- రోడ్లు వేసుకున్న రియల్టర్లు
- నెర్రపల్లిలో రెచ్చిపోతున్న వ్యాపారులు
- పట్టించుకోని రెవెన్యు అధికారులు



గతంలో బోర్డు పాతిన అధికారులు



నెర్రపల్లి సర్వే నెంబరు 26లో రోడ్డు వేసిన రియల్టర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ భూములపై రియల్టర్ల కన్ను పడింది. కాదేది కబ్జాలకు అడ్డు అన్నట్లుగా రాత్రికిరాత్రే భూముల్లో రోడ్లు, ఇనుప కంచెలు వెలుస్తున్నాయి. ఈ విషయంలో పట్టించుకునే వారు లేరు. కొదరు అనుమతులు తీసుకోకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. కంజర్వేషన్ జోన్‌లో ప్లాట్లు చేసి గజాల్లో ధరలు నిర్ణయించి అమ్ముకుంటున్నారు. గుంటల్లో చేసి ఫాంల్యాండ్స్‌కు రిజిస్ట్రేషన్లు చేయొద్దని ప్రభుత్వం చెబుతుంటే రెవెన్యు అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా రియల్టర్లకు ఒత్తాసు పలుకుతున్నారు.

నెర్రపల్లిలో రూ. కోట్లల్లో దోపిడీ

ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి, నెర్రపల్లి, తులేకలాన్, కప్పపహాడ్, ఎల్మినేడు, కొంగరకలాన్, ఖానాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి. గతంలో అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయిన సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అలాగే ప్రస్తుతం ఇబ్రహీంపట్నం మండలంలోని సర్వే నెంబరు 26లోగైరాని సర్కారు భూమి 8 ఎకరాలు రైతులకు అసైన్ చేశారు. ఇదే సర్వే నెంబరులో మరో 2.1 ఎకరాల భూమి మిగిలి ఉంది. ఈ భూమిలో కొంత వరకు రాళ్లు , రప్పలు ఉండగా అప్పట్లో అధికారులు అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఈ భూమి చుట్టూ స్థిరాస్తి వెంచర్లు వెలిశాయి. ఎకరం భూమి ధర రూ.2 కోట్ల వరకు పలుకుతుంది. ఇక్కడ అధికారులు సరైన హద్దులు పెట్టకపోవడంతో కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే ఇదే భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోడ్లు వేసుకున్నారు. మరి కొంత మంది వ్యవసాయ పొలాలకు రోడ్లు వేసుకున్నారు. కొందరైతే ఏకంగా ప్లాట్లుగా చేసుకున్నారు. రెవెన్యు అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని నెర్రపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఇబ్రహీంపట్నం మండలంలో ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే సహించేది లేదు. నెర్రపల్లి గ్రామంలో సర్వే నెంబరు 26 గురించి పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం. ఆర్ఐలను పంపించి రికార్డు లను తనిఖీ చేయిస్తా. విచారణ అనంతరం బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం.

– సునిత, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం

ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన డీఎం

సాక్షి ఎఫెక్ట్..

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై రాకపోకలు సాగించే దేవరకొండ డిపో ఎక్స్‌ప్రెస్ బస్సును యాచారం ఆర్టీసీ బస్టాండ్‌లోకి వచ్చేలా కృషి చేస్తానని దేవరకొండ డిపో మేనేజర్ రాజీవ్‌ప్రేమ్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'నామ్‌కే వాస్తే' కథనానికి ఆయన స్పందించారు. గురువారం ఉదయం 11 గంటలకు సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే డీవీకే ఎక్స్‌ప్రెస్ బస్సుల విషయంలో ప్రయాణికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విషయం తెలుసుకున్న డ్రైవర్లు, కండక్టర్లు సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే బస్సులను బస్టాండ్‌లోకి మళ్లించారు. దాదాపు రెండు గంటల పాటు బస్టాండ్‌లోనే ఉన్నా మేనేజర్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణికులు ఉన్నా, లేకున్నా కచ్చితంగా బస్సులు వచ్చి పోవాల్సిందేనని డ్రైవర్లకు సూచించారు. డీవీకే ఎక్స్‌ప్రెస్ బస్సుల రాకపోకలపై బస్సుల నంబర్లతో సహా నమోదు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం డిపో సిబ్బందికి సూచించారు. ప్రయాణికులను గౌరవించాలని, చేయి ఎత్తిన చోట బస్సు ఆపి ఎక్కించుకోవాలన్నారు. బస్టాండ్‌లోకి డీవీకే ఎక్స్‌ప్రెస్ బస్సులు వస్తుండడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న రాజీవ్ ప్రేమ్‌కుమార్

ఓటు.. వజ్రాయుధం!

- ఏపీఎం శ్రీదేవి
- ఓటు హక్కుపై అవగాహన

తలకొండపల్లి: ఓటు అనేది వజ్రాయుధం వంటిదని ఏపీఎం శ్రీదేవి అన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం ఏపీఎం ఆధ్వర్యంలో సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరియల్ పార్టిసిపేషన్ కార్యక్రమంపై మహిళా గ్రూప్ అధ్యక్షురాలు, సభ్యులకు ఓటు హక్కుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యత వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండితే తప్పకుండా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళామండల సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

విగ్రహ ఏర్పాటునకు శంకుస్థాపన



మాట్లాడుతున్న సదా వెంకట్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కొనకట్టపై 108 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహ శంకుస్థాపనను చేయనున్నట్లు శ్రీ హరివర అఖండ క్షేత్ర సమితి వ్యవస్థాపకుడు సదా వెంకట్ తెలిపారు. గురువారం శేరిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగద్గురు శంకరచార్యులు శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ చేతుల మీదుగా రుత్వికుల సమక్షంలో 30వ తేదీ ఉదయం 9 గంటల 44 నిమిషాలకు శంకుస్థాపన చేస్తారన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

స్థల పరిశీలన...

పంచముఖ హనుమాన్ విగ్రహ శంకుస్థాపన స్థలాన్ని సాయంత్రం జగద్గురు శ్రీ విద్యారణ్య భారతీ స్వామిజీ పరిశీలించారు. అనంతరం అఖండ క్షేత్ర ప్రచార రథ వాహనాలను ప్రారంభించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

షాబాద్: ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి తనవంతు సహాయంగా రూ.3లక్షల విరాళం అందజేశారు. అనంతరం జెడ్పీటీసీని గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించా రు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. పురాతన ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ సులోచనశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కడ్తాల్: పోషణ పక్షంలో భాగంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



తలకొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ

తలకొండపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ అన్నారు. విటమిన్లు, ప్రోటీన్లు, మిలెట్స్, తదితర పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకున్నట్లెతై ఆరోగ్యం పదిలంగా ఉండడమే గాకుండా వ్యాధులు దరి చేరవన్నారు. పెద్దూర్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషక పక్షం నిర్వహించారు. చౌకగా దొరికె ఆకుకూరలు, కూరగాయలతో పోషకాహారాన్ని తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం చంద్రకళ మాట్లాడారు. ఆహార లేమితో గర్భిణులు, తల్లులు, కిశోర్ బాలికలు, మహిళల్లో రక్తహీనత, వచ్చే ప్రమాదముందన్నారు. అన్ని పోషక విలువలున్న ఆహారపదార్థాలను సమతుల్యంగా తీసుకోవడంతోనే రక్తహీనత నివారించొచ్చన్నారు. ఈ కార్యక్రమమంలో హెచ్ఎం అనురాధా, హేమలత, గర్భిణులు, బాలింతలు, మహిళలు, ఆశా వర్కర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్, వాస్‌దేవ్‌పూర్ గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షంపై మహిళలకు, గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలవర్ధకమైన పోషకాహారం, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు ప్రాముఖ్యత వివరించారు. రక్తహీనత నివారణ, తల్లి బిడ్డ సంరక్షణకు 1000 రోజుల ప్రాధాన్యత, అనుబంధ పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. అదే విధంగా చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శబరి, సరళాదేవి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు అంజమ్మ, సంగీత, శోభరాణి, కార్యదర్శి చరిత పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



సర్టిఫికేట్‌లు ప్రదానం చేస్తున్న గోపాల్, శ్రీనివాస్

ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పిడి గోపాల్

కడ్తాల్: రక్తదానంతో ప్రాణదానం చేసినట్లేనని జిల్లా ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి బొప్పిడి గోపాల్, సింగిల్‌విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో పీవీ బ్లడ్ సెంటర్ హిమాయత్‌నగర్ ఆధ్వర్యంలో వలెంటరీ బ్లడ్ డొనేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అనంతరం రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్స్ అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో పీవీ నర్సింహారావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, సీఈవో సుధాకిరణ్, మాజీ సర్పంచ్‌లు విఠలయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ రంగయ్య, బాలకృష్ణ, లింగం, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంగ్లిష్ పరీక్ష

తలకొండపల్లి: మండలంలో ఏర్పాటు చేసిన తలకొండపల్లి, వెల్జాల్ పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రంలో 254మందికి 253, వెల్జాల్ పరీక్షా కేంద్రంలో 102కు 100మంది పరీక్షలు రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు పర్వతాలు, రామనాథంలు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ రంగారెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ రామచంద్రారెడ్డిలు సందర్శించారు.

విగ్రహావిష్కరణకు సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనలో మార్చి 26న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డిని ఆర్థిక సహాయం చేయాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన రూ.10వేలు సాయం చేశారు. కార్యక్రమంలో గణేశ్, రమేశ్, సంతోశ్, మల్లేశ్, సుధాకర్, ప్రవీణ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఆమనగల్లు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భజన చేస్తున్న విద్యార్థులు

మాడ్గుల: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైబవంగా కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది ఐదు రోజుల పాటు వార్షికోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా వైబవంగా నిర్వహించినట్లు, భక్తులు అధికంగా వస్తుండడంతో మరో రెండు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారని ఆలయ ధర్మకర్త గూడ కష్ణమాచార్యులు తెలిపారు. ఆలయంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

కల్కిదొన గుట్ట ఆలయంలో...

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ కలిక్కదొనగుట్ట ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారు జామున పూల రథోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పట్టాభిరామశర్మ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై కూర్చుండబెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు రథాన్ని లాగారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తిశర్మ, నితిన్‌శర్మ, ఆలయ ఫౌండరి ట్రస్టు చైర్మన్ సిద్ధాంతి పట్టాభిశర్మ, మల్లారెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: కల్కిదొనగుట్ట ఆలయంలో రథోత్సవంలో భక్తులు

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



హాజరైన భక్తులు



ఉత్సవ మూర్తులు



కల్యాణ వేడుకలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

- వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువైన శ్రీ భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం జయజయ ధ్వనుల మధ్య గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరున్ని బ్యాండు మేళాలతో పట్టు వస్త్రాలు అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మంగళ వాయిద్యాల చప్పుళ్ల నడుమ కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. పండితప్రకర్శ శ్రీమాన్ తిరుమల వింజమూరి రామానుజాచార్యులు, ఆదిత్యాచార్యులు, కన్నయ్యచార్యులు, చిదంబరంశర్మల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణం తిలకించి పూజలు నిర్వహించారు. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా మంచినీటి సౌకర్యం కల్పించగా, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నదానం ఏర్పాటు చేశారు.

హాజరైన నేతలు

శ్రీభూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ వేడుకలకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ హాజరై ఉత్సవాలను తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశీక ధర్మకర్త రాంచందర్‌రావు, కిరణ్ ఎంపీటీసీ గోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచులు విఠలయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, కన్ననాయక్, మాజీ ఎంపీటీసీలు రంగయ్య, వసంత, క్రాంతి కుమార్, బాలకృష్ణ , రవికుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



తాళిబొట్టు చూపిస్తున్న వేద పండితుడు

అప్పారి వెంకటస్వామికి ఘన నివాళులు

ఇబ్రహీంపట్నం: అప్పారి వెంకటస్వామి వర్ధంతిని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఇబ్రహీంపట్నంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గాలయ్య మాట్లాడుతూ 18 సంవత్సరాల సర్వీసును త్యాగం చేసి ఉపాధ్యాయ ఉద్యమాన్ని పటిష్ఠం చేశారని గుర్తుచేసుకున్నారు.హెచ్ఆర్ఏ పెంపులో, ఏఏఎస్ సాధించడంలో, 2002 డీఎస్సీకి ఓపీఎస్ సాధించడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. రాబోయే కాలంలో విద్యారంగాన్ని కాపాడుకోవాలన్నారు. సీపీఎస్ రద్దయ్యే వరకూ ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలన్నారు. 317 జీవో బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సుగంధ, రాములయ్య, అర్జున్ రెడ్డి, నాగేంద్రం, అజ్మత్‌ఖాన్, కిరణ్, శ్రీను, రవి, నర్సింహ్మా, ధన్‌రాజ్, జహీర్, బాలునాయక్‌లు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నేతలు